క్లుప్తంగా

ధమరుకం బహూకరణ



బుడ్డిపేట ఆంజనేయస్వామి ఆలయంలో సమర్పించిన ధమరుకం

సీతానగరం: మండలంలోని పెదభోగిలి పంచాయతీ పరిధి బుడ్డిపేట గ్రామస్తులు నిర్మించుకున్న ఆంజనేయ స్వామి ఆలయానికి అదేగ్రామానికి చెందిన రుంకాన రాజశేఖర్ ధమరుకాన్ని బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ రహదారిని ఆనుకుని ఉన్న బుడ్డిపేటలో ఆధ్యాత్మికంగా ప్రతి ఒక్కరూ ఆంజనేయస్వామిని దర్శించుకుని పూజవేళలో ధమరుకాన్ని వాయించడం పరిపాటుగా వస్తోందన్నారు. ఆంజనేయస్వామిపై ఉన్న నమ్మకంతో తనవంతుగా ధమరుకాన్ని బహూకరించడం ఆనందంగా ఉందన్నారు.

సొంత నిధులతో బోరు ఏర్పాటు



అంపావల్లి సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన బోరు

బలిజిపేట: మండలంలోని అంపావల్లి సెంటర్ వద్ద సర్పంచ్ శెట్టి వెంకటరత్నం తన సొంత నిధులతో బోరు తవ్వించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంపావల్లి సెంటర్ వద్ద చాలామంది ప్రయాణికులు రాజాం, బలిజిపేట వెళ్లేందుకు నిరీక్షిస్తుంటారని ఇక్కడ తాగునీటి సదుపాయం లేనందున తమ సొంత నిధులు రూ.50వేలు వెచ్చించి బోరు ఏర్పాటు చేశామన్నారు. వేసవి ప్రభావంతో దాహార్తిని తీర్చుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వేతనదారులకు తాగునీరు, నీడ కల్పన



మస్తరు వెరిఫికేషన్ చేస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా ఉపాధిహామీ పథకం వేతనదారులు పనులు చేస్తున్న ప్రాంతాల్లో దాహార్తిని తీర్చడానికి, నీడ సౌకర్యం కల్పించడానికి ప్రాధాన్యం ఇచ్చామని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు పెదభోగిలి, సీతానగరం, అప్పయ్యపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి వేతనదారులకు మంచినీటి సౌకర్యం కల్పించడంతోపాటు నీడనిచ్చేవిధంగా టెంట్‌లు వేయాలని మేట్‌లు, క్షేత్ర సహాయకులకు సూచనలిచ్చామని తెలియజేశారు. కార్యక్రమంలో టీఏలు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న అగ్నిమాపకశాఖాధికారి రాజారావు

సాలూరు: అగ్నిప్రమాదాలు సంభవించకుండా అప్రమత్తంగా ఉంటూ, తగు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపకశాఖాధికారి రాజారావు అన్నారు. ఈ మేరకు అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ వద్ద అగ్నిప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవికాలం నేపథ్యంలో అగ్నిప్రమాదాలు సంభవించే ప్రమాదముందని తెలిపారు. అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలను ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

21 నుంచి ఏకలవ్యలో 6వ తరగతి అడ్మిషన్లు

మక్కువ: ఈనెల 21వ తేదీ నుంచి అనసభద్ర ఏకలవ్య పాఠశాలలో ఆరవ తరగతిలో విద్యార్థులు చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభం కానున్నట్లు ప్రిన్సిపాల్ బి.ఎర్రునాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరవతరగతిలో విద్యార్థులు చేరేందుకు ఇటీవల ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించామన్నారు. ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థుల్లో, ఎవరైతే అర్హత సాధించారో, వారికి ఆయా పాఠశాలల నుంచి ఫోన్ ద్వారా సమాచారం వస్తుందని, తల్లిదండ్రులు సంబంధిత ధ్రువీకరణపత్రాలతో పాటు విద్యార్థులను ఆయా పాఠశాలలకు తీసుకువెళ్లాల్సి ఉందన్నారు. పై విషయాలను విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని కోరారు.

ఉపాధి కూలీలకు వసతులు కరువు

- మండుతున్న ఎండలు
- పనివద్ద అందుబాటులో లేని టెంట్లు
- చెట్లకింద తలదాచుకుంటున్న కూలీలు
- కరువైన నీటివసతి



బలిజిపేటలో నేరేడుకర్ర చెరువు గట్టుపై తలపై వస్త్రాలు కప్పుకుని కూర్చున్న వేతనదారులు

బలిజిపేట: వేసవి ఎండలు మండుతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఉపాధి పనులకు వెళ్లే కూలీలు తల్లడిల్లిపోతున్నారు. వేసవిలో పనిప్రదేశాల్లో ఉపాధి కూలీలకు అవసరమైన వసతులు కల్పించాల్సి ఉన్నప్పటికీ అధికారులు, సిబ్బంది వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కనిపించని టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు

గతంలో ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా ఉపాధి కూలీలకు అందజేసిన టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయాయి. వేసవిలో పని ప్రదేశంలో ఉపాధి కూలీలు సేదదీరేందుకు టెంట్లతో పాటు ప్రథమ చికిత్స కిట్లు పంపిణీ చేసేది. అదేవిధంగా వడదెబ్బ నుంచి రక్షణకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, మంచినీటిని సైతం అందజేసేది. అలాగే వేసవిలో ఉపాధి కూలీలకు అదనంగా పది నుంచి ఇరవై శాతం వరకు అలవెన్సులు ఇచ్చేవారు. వాటితో పాటు గడ్డపారలు, గునపాలు వంటివి అందజేసి కూలీలను గత ప్రభుత్వంప్రోత్సహించేది. ప్రస్తుతం కూలీలకు ఎలాంటి వసతులు కల్పించకపోవడంతో కొన్నిచోట్ల ఉపాధి పనులకు వెళ్లేందుకు వెనుకాడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఉపాధి పనుల వద్ద టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు, మజ్జిగ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర సౌకర్యాలు కల్పించాలని కూలీలు కోరుతున్నారు. గ్రామాలకు సమీపంలో ఉండే చెరువుల పనులైతే సమస్యలు వచ్చినా వెంటనే



అరకొరగా వేసిన టెంటులో తలదాచుకున్న వేతనదారులు

స్పందించి తగుచర్యలు చేపట్టే అవకాశాలు ఉంటాయి తప్ప దూరంగా ఉండే చెరువుల పనులకు వెళ్లేటప్పుడు ఎటువంటి సమస్య వచ్చినా చాలా ఇబ్బందులు పడే అవకాశాలున్నాయని కూలీలు వాపోతున్నారు. ఉపాధిపనుల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. అదేవిధంగా రెండు పూటలా పనులు చేపట్టడం వల్ల సాయంత్రం సమయంలో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వాతావరణం ఎదురవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని దీనిపై

మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పాం

ఉపాధి పనుల కల్పన వద్ద కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పాం. టెంట్లు, నీటి సదుపాయం, ప్రథమ చికిత్స కిట్లు కల్పించమని శాఖ సిబ్బందికి సూచించాం. దీనిపై పర్యవేక్షించి చర్యలు చేపట్టనున్నాం.

– ఏవీఎస్ నగేష్, ఎంపీడీఓ, బలిజిపేట

అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పనిచేసిన కాలానికి ఉపాధి బిల్లులు పెండింగ్‌లో ఉండిపోతున్నాయని వారాల తరబడి పేరుకుపోయిన బకాయిలను చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మండలంలో 420గ్రూపులు ఉన్నాయి. జాబ్‌కార్డులు ఉన్నవారు 14,013మంది. యాక్టివేషన్‌లో ఉన్న జాబ్‌కార్డులు 13,651. వేతనదారులు 18,622మంది. యాక్టివేషన్ వేతనదారులు 13వేలమందికి పైగా ఉన్నారు.

ఎమ్మెల్యే సిఫార్సులకే కేటాయిస్తే దరఖాస్తు ఎందుకు?

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల నిలదీత



ఎంపీడీఓను ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: ఎమ్మెల్యే సిఫార్సుల మీదనే బీసీ కార్పొరేషన్ యూనిట్ల కేటాయింపులు జరిపితే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎందుకు మోసం చేయడమని, ముందుగానే అభ్యర్థులను గుర్తించి వారికే యూనిట్లు కేటాయించి ఇచ్చివేస్తే సరిపోయేది కదా అని పలువురు సభ్యులు ఎంపీడీఓ నగేష్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నాగమణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సమావేశంలో బీసీ కార్పొరేషన్ యూనిట్ల అంశంపై చర్చించినప్పుడు జెడ్పీటీసీ రవికుమార్ ఎంపీడీఓ నగేష్‌ను యూనిట్ల వివరాలు, ఇప్పటికి ఎన్ని సిఫార్సు చేశారు? ఏవిధంగా చేశారని ప్రశ్నించారు. దీనికి ఎంపీడీఓ నగేష్ సమాధానం ఇస్తూ మండలానికి 126యూనిట్లు మంజూరయ్యాయని వాటికి 780దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. యూనిట్లకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. వాటిలో 44యూనిట్లు బ్యాంకులకు పంపించామని తెలిపారు. వాటిని ఏవిధంగా కేటాయించారని ప్రశ్నించగా అదంతా ఎమ్మెల్యే చూసుకున్నారన్నారు.

ఎమ్మెల్యే సూచనల మేరకే కేటాయింపు

దీనికి సంబంధించి ఎమ్మెల్యే సూచనలు పాటించాలని ఉన్నతాధికారుల ఆదేశాలు ఏమైనా ఉన్నాయా? అని ప్రశ్నించగా ఆన్‌లైన్ మీటింగ్‌లో బీసీ కార్పొరేషన్ ఈడీ ఎమ్మెల్యే సూచనల మేరకే జరిపించాలని తెలియపరిచారని ఎంపీడీఓ నగేష్ సభాముఖంగా తెలిపారు. అయితే మండల పరిషత్ సభ్యులు ఉన్నారు కదా? వారికి కొంత ప్రాధాన్యం కల్పించే విధంగా చూడాల్సిన అవసరం మీకు ఉందికదా? వారిని గౌరవించి వారికి ప్రాధాన్యం కల్పించకుండా అంతా ఎమ్మెల్యే సూచనలతోనే ఇష్టానుసారం కేటాయిస్తే ఆన్‌లైన్ దరఖాస్తులు ఎందుకు చేయించడమని సభ్యులు ప్రశ్నించారు. అరసాడ ఎంపీటీసీ జి.ప్రభావతి మాట్లాడుతూ అంతా టీడీపీ వారికే కేటాయిస్తామని ముందుగా చెప్పి ఉంటే మరెవరూ దరఖాస్తు చేసుకుని ఉండేవారు కాదుకదా అని ఆగ్రహించారు. మండల పరిషత్ సభ్యులు ఉన్నారు కదా? వారికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యేతో చెప్పగా తన ఆదేశాలు లేనిదే సొంత నిర్ణయాలతో ఏమీ చేయవద్దని ఎమ్మెల్యే ఆదేశించారని ఎంపీడీఓ నగేష్ సభాముఖంగా తెలిపారు. వ్యవసాయశాఖ అధికారి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ మండలానికి వ్యవసాయ పరికరాలు 12యూనిట్లు వచ్చాయని తెలపగా వాటిని ఏవిధంగా పంపిణీ చేశారని సభ్యులు ప్రశ్నించి ఆగ్రహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ పుష్పారావు, మండలస్థాయి అధికారులు, సభ్యులు, సర్పంచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో క్యూఆర్ కోడ్‌లు ఏర్పాటు





ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద క్యూఆర్ కోడ్‌ను అంటిస్తున్న కానిస్టేబుల్, కలెక్టరేట్ వద్ద క్యూఆర్ కోడ్ ఏర్పాటు

- బహిరంగ ప్రదేశాల్లో క్యూర్ కోడ్‌ల ఏర్పాటు

పార్వతీపురం రూరల్: గంజాయి తాగే వారి వివరాల నమోదు కోసం ప్రధాన కూడళ్లు, బహిరంగ ప్రదేశాల్లో పోలీస్ సిబ్బంది క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పట్టణ పోలీస్ సిబ్బంది పేర్కొన్నారు. స్నేహితులు, సన్నిహితులు, కుటుంబసభ్యులు, తెలియ వచ్చిన వారు ఎవరైనా గంజాయి లేదా మాదకద్రవ్యాలు ఉపయోగిస్తే వారి వివరాలు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో ఫామ్ ఫిల్ చేసి వారి వివరాలు నమోదు చేయాలని కోరారు. అలాగే ఆఫ్‌లైన్‌లో కూడా ఫారాలు అందుబాటులో ఉంటాయని పట్టణ పోలీసు సిబ్బంది తెలిపారు. వివరాలు తెలియపరిచిన వ్యక్తుల సమాచారాన్ని గుట్టుగా ఉంచనున్నామన్నారు. మాదకద్రవ్యాలు, గంజాయి వాడకాన్ని పూర్తిగా నిషేధించేందుకు పోలీస్‌శాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అవగాహనతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా గంజాయి లేదా ప్రమాదకరమైన మాదకద్రవ్యాలను ఉపయోగించే వారి వివరాలు తెలియపరచాలని కోరారు. గంజాయి బారిన పడిన వ్యక్తులను ప్రత్యేక హాస్టల్లో ఉంచి వారికి కౌన్సెలింగ్ ఇవ్వనున్నామన్నారు.

580 ఎకరాల్లో ఈ పంట నమోదు



మాట్లాడుతున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలోని పొలాల్లో రైతులు సాగు చేస్తున్న నువ్వుచేనులో వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న ఈ పంటనమోదు కార్యక్రమం పూర్తి కావచ్చిందని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. మాగాణీ భూముల్లో రైతులు సాగు చేసిన నువ్వు పంట భూములను ఏఓ అవినాష్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలుగ్రామాల్లో రైతులు 580 ఎకరాల విస్తీర్ణంలో నువ్వు పంట సాగు చేశారన్నారు. నువ్వు చేనులో ఈ పంట నమోదు చేయడం ప్రారంభించి నిర్దేశించిన గడువులోగా వ్యవసాయ సహాయకులు ఈ పంట నమోదు చేశారన్నారు. ఈ పంట నమోదు పూర్తి కావడంతో ఉన్నతాధికారులకు సంబంధిత నివేదిక సమర్పించనున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో అంటిపేట, వెంకటాపురం రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

తుమరాడలో పారిశుధ్య పనులు



గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తున్న కూలీలు

సాక్షి ఎఫెక్ట్...

బలిజిపేట: మండలంలోని తుమరాడలో కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. సాక్షి దినపత్రికలో 'ప్రమాదం అంచున ప్రజారోగ్యం' శీర్షికన వెలువడిన కథనంపై స్పందించి బుధవారం పారిశుధ్యపనులు నిర్వహించారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తచెదారాలను తొలగించి, మురుగునీటిని తరలించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



అంపావల్లిలో డ్రైవ్ నిర్వహిస్తున్న వంతరాం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

బలిజిపేట:

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి మంచి విద్యను పొందాలని వంతరాం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు మండలంలోని అంపావల్లిలో పాఠశాల అడ్మిషన్ల డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం గ్రామంలో పర్యటించి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులను కలిసి ప్రభుత్వ పాఠశాలలోఉండే మౌలిక సదుపాయాలు, ఉచిత విద్య, ఉపాధ్యాయుల అనుభవం, ఎందుకు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించమంటున్నామనేది వారికి వివరించారు. అదేవిధంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి 6వ తరగతిలో వంతరాం ఉన్నత పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ కక్షలు విడనాడాలి



డీఆర్ఓ హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పార్వతీపురంటౌన్: కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్షలను, ప్రతీకార చర్యలను విడనాడాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు బి.మోహన్‌రావు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన తెలియజేసి అనంతరం డీఆర్ఓ హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షంపై ప్రతీకార చర్యలను మానుకోవాలని హితవు పలికారు. అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ వంగల దాలి నాయుడు, సాలూరు ఇన్‌చార్జ్ గేదెల రామకృష్ణ, ఓబీసీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సిరిసిపిల్లి సాయి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్వతీపురం మండల అధ్యక్షుడు తీళ్ల గౌరీ శంకరరావు, మామిడి చంద్ర కుమార్, ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సందర్శన



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

సీతానగరం: స్థానిక పీహెచ్‌సీ పరిధిలో లెప్రసీ కేసులు, టీబీ కేసులకు సంబంధించిన రికార్డులు సమగ్ర సమాచారంతో సిబ్బంది వద్ద ఉండాలని డీఎంహెచ్‌ఓ భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు సీతానగరం పీహెచ్‌సీని ఆయన బుధవారం ఆకస్మికంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి ఉషారాణి, సూపర్‌వైజర్లు సత్యవతి, శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

అనసభద్ర ఏకలవ్య స్కూల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి


- కలెక్టర్‌కు ఏఐఎస్ఎఫ్ నాయకుల వినతి



కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పార్వతీపురంటౌన్: అనసభద్ర ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలియజేసి అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మక్కువ మండలం అనసభద్ర ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థులను కొట్టిన వార్డెన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని కోరారు. ఆదివారం రాత్రి పాఠశాలలో పనిచేస్తున్న ఆరోగ్య కార్యకర్త దుస్తులు పోవడం వల్ల విద్యార్థులను బాధ్యులను చేస్తూ వారిని శారీరక ఇబ్బందులకు గురిచేశారన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు ఎటువంటి సమాచారం ఇచ్చిన టీసీ ఇచ్చేస్తామన్న వార్డెన్‌పై మండిపడ్డారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌ను నిలదీయగా, తనకు ఎటువంటి సమాచారం రాలేదని ప్రిన్సిపాల్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. మౌలిక వసతులు, భోజనాలు చాలా ఇబ్బందిగా ఉన్నాయని విద్యార్థులు తెలియజేశారన్నారు. తక్షణమే సంబంధిత విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకుడు వికాస్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తివిద్య కోర్సు పూర్తి చేసుకున్న 'మోడల్' విద్యార్థులు



టైలరింగ్‌లో మెలకువలు తెలుసుకుంటున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

మక్కువ: ప్రభుత్వం ఆధ్వర్యంలో పది రోజుల పాటు నిర్వహించిన వృత్తి విద్యా కోర్సుల (ఇంటర్న్‌షిప్) శిక్షణ బుధవారం ముగిసినట్లు మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.స్వర్ణలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు ఈనెల 7వ తేదీ నుంచి మండల కేంద్రం మక్కువలో టైలరింగ్, మీసేవ సర్వీసుపై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఒకేషనల్ కోఆర్డినేటర్లు వాసు, సుధాకర్ విద్యార్థులకు వత్తివిద్యపై అవగాహన కల్పించారన్నారు. స్వయం ఉపాధి పొందేందుకు వత్తివిద్య కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రిన్సిపల్ స్వర్ణలత అభిప్రాయ పడ్డారు.

కల్వర్టు నిర్మాణం కోసం డైవర్షన్ రోడ్డు ఏర్పాటు



కల్వర్టు నిర్మాణం కోసం డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్...

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రం ప్రారంభంలో పార్వతీపురం మండల పరిధి శక్తినగర్ వద్ద ఉన్న రాష్ట్రీయ రహదారిపై ఉన్న కల్వర్టు గతేడాది కురిసిన భారీ వర్షాలకు కొంతభాగం కుంగి శిథిలావస్థకు చేరింది. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు ప్రమాదాలు జరగకుండా రహదారిపై శిథిలావస్థకు చేరిన భాగంలో గోడను నిర్మించారు. ఈ క్రమంలో సాక్షి దినపత్రికలో 'ఈ రహదారికి మోక్షమెప్పుడో' శీర్షిక కథనం ప్రచురితమైన నేపథ్యంలో సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రూ.76 లక్షలతో కల్వర్టు నిర్మాణం కోసం పనులు ప్రారంభించారు. ఈ మేరకు వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా పక్కనుంచి డైవర్షన్ రోడ్డు పనులు ప్రారంభించారు. వీలైనంత త్వరగా కల్వర్టు నిర్మాణం పూర్తి సురక్షితమైన రహదారిని వాహన చోదకులకు ఏర్పాటు చేస్తామని ఆర్అండ్‌బీ అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

నవధాన్యాలతో భూసారం



చినబొండపల్లి గ్రామంలో నవధాన్యాలను రైతులకు అందిస్తున్న సర్పంచ్ శంకరరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

పార్వతీపురం రూరల్: నేలసారం పెంచి రసాయన ఎరువుల భారం తగ్గించేలా నవధాన్యాల సాగు చేపట్టేందుకు ప్రకృతిసేద్యం పెంపులో భాగంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నవధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో బుధవారం మండలంలోని చినబొండపల్లి గ్రామంలో సర్పంచ్ గండి శంకరరావు నేతృత్వంలో రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ సభ్యురాలు ఎస్.రమణమ్మ రైతులకు నవదాన్యాల పంటల సాగుపై, అలాగే వాటి వల్ల కలిగే భూసారంపై తెలియజేశారు. పకృతి వ్యవసాయ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి నేలసారాన్ని కాపాడాలని, రసాయన ఎరువుల భారాన్ని తగ్గించాలని, ఇందుకు నవధాన్యాల సాగు ఆవశ్యకతను వివరించేందుకు కార్యచరణ చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఈ సభలో కొంతమంది రైతులకు నవధాన్యాలు అందించగా అవసరమైన రైతులకు వారి గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

చిట్టిగెడ్డ ఆక్రమించి కప్పేయడం చట్ట విరుద్ధం



కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

పార్వతీపురం టౌన్: చిట్టిగెడ్డను ఆక్రమించి కప్పేయడం చట్ట విరుద్ధమని ఏపీ రైతు సంఘం నాయకుడు ఎం.కృష్ణమూర్తి మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం కలెక్టరేట్‌లో ఆవరణలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మండలం తాళ్లబురిడి గ్రామంలో శాఖ గడ్డపై అడ్డుకట్టలు వేసి సాగుభూములకు నీరుమళ్లించి 1943 నుంచి పంటలు పండిస్తున్నారన్నారు. చిట్టిగెడ్డను ఆక్రమించి కప్పేయడం వల్ల 300 ఎకరాల భూములు గల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం కలగజేసుకుని చిట్టి బట్టీలను సరిచేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ గెడ్డపై చెక్‌డ్యాములు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బంటు దాసు, రామకృష్ణ, అప్పారావు, నారాయణస్వామి రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హిందీ పోటీలు

పార్వతీపురంటౌన్:

హిందీ ప్రచారసభ హైదరాబాద్‌ను స్థాపించి 90 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విద్యార్థులకు పలు హిందీ పోటీలను నిర్వహిస్తున్నారు. హైస్కూల్, కాలేజీ విద్యార్థులకు వేరువేరుగా హిందీ పోటీలను నిర్వహిస్తున్నట్లు హిందీ ప్రచార సభ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు పార్వతీపురం పట్టణానికి చెందిన డా.మంచిపల్లి శ్రీరాములు, ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచార సభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.పార్థసారథి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కోనే శ్రీధర్‌లు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హిందీ వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్, కథ–కవితా పఠనం పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రీయ ఏకతా కేలియే హిందీ కా మహత్వ' అనే అంశంపై హైస్కూల్, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు కనీసం మూడు పేజీలకు తగ్గకుండా హిందీ భాషలో వ్యాసం రాసి ఈనెల 20వ తేదీన పార్వతీపురంలోని హిందీ పండిట్స్ ట్రైనింగ్ కాలేజీలో ఇవ్వాలని తెలిపారు. అలాగే వ్యాసం మొదటి పేజీలో పేరు, స్కూల్/కాలేజీ పేరు, చదువు, మొబైల్ నెంబర్ వివరాలను రాయాలని పేర్కొన్నారు. పోటీలో పాల్గొన్న వారందరికీ పార్టిసిపేట్ సర్టిఫికెట్స్, విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.